


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

# శ్రమతో సేవ - సేవతో కైవల్యం

వ్యవస్థాపకులు: శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ ఎడిటర్ : గొర్తి సాయి సుబ్రహ్మణ్యం

శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధించిన "శ్రమతో సేవ - సేవతో కైవల్యం" ను అనుసరించి మా జన్మలు ధన్యం గావించుటకు ఈ మాసపత్రికను ప్రారంభిస్తున్నాము. శ్రీ సుబ్బరామయ్య సార్ మనకందించిన అనుభవాలను, సాంగత్య స్మృతులను, సార్ ఆచరించి బోధించిన అమూల్య విషయాలను స్మరించుకొనుటకు, మహాత్ములు బోధించిన సత్సంగ, సద్గ్రంధ పఠనలకు ప్రేరణగా ఈ మా చిన్న సేవ.
గమనిక : ఎవరైనా ఈ మాగజైన్ లో తమ వ్యాసాలను, అనుభవాలను పంచుకోదలిచినవారు saimaster.sevatrust@gmail.com కు e-mail చేయగలరు

సంపుటి : 05
సంచిక : 08


## నేపథ్యం
## అల్లా మాలిక్

మాఘ పౌర్ణమి
ఫిబ్రవరి 27, 2020

| శ్రీ సుబ్బరామయ్య సార్ ప్రవచనం | శ్రీ సార్ ఈ స్పీచ్ లో రాగ ద్వేషాదుల కు కారణం "కర్తృత్వం" అని వాని నుండి, వాటికి కారణ మైన ఇష్టా అయిష్టాల నుండి బయటపడే మార్గం "అల్లామాలిక్" అనే ఎరుక అని తెలుపుతున్నారు. http://saimastersevatrust.org/Speeches/How%20to%20get%20rid%20of%20Anger.mp3 |
|---|---|



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దగ్గాస్వామి

శరీర మింద్రియం ప్రాణం - అర్ధ స్వజన బాంధవాన్ !


ఆత్మదారాదికం సర్వం - సద్గురుభ్యో నివేద యేత్ ! !



సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్ సమాధి


**చదువరులకు విజ్ఞప్తి: ఆడియో వినుటకు అండర్లైన్ చేసి వున్న ఆ సెక్షన్ టైటిల్స్ లను క్లిక్ చేయండి.**


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

# విషయ సూచిక


| # | విషయం | పేజీ నెంబర్ |
|---|---|---|
| 1 | సంపాదకీయం | 3 |
| 2 | సాయిశివ డైరీ నుండి సార్ చెప్పినవి | 13 |
| 3 | భక్తుల అనుభవాలు | 15 |
| 4 | శ్రీ సుబ్బరామయ్య సార్ లేఖలు | 20 |


# సంపాదకీయం

ఓం శ్రీ సాయిరాం

**అల్లా మాలిక్**

సాయిబాబా భక్తులకు తమ దివ్యమైన లీలలను ప్రసాదిస్తూ నిరంతరం భక్తులతో అల్లా మాలిక్ అంటూ ఉండేవారు. అంటే ఆ దివ్య లీలలన్నీ అల్లాయే (భగవంతుడే) తమ ఇష్టానుసారం జరిపిస్తున్నారు, ఆయనే సర్వ

సమర్థుడని, లేశమాత్రమైనా కర్తృత్వ భావాన్ని తమపై ఉంచుకునేవారు కాదు సాయి.

అదేవిధంగా భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి వారు భక్తులకు ఎన్ని కష్టాలను తీర్చినా, ఎందరినో ఆపదల నుండి రక్షించినా, నెల్లూరు రంగనాయకుల స్వామి, పెంచల నరసింహస్వామి, కంచి వరదరాజ స్వామివార్లు కాపాడారు అని చెప్పేవారు. ఏ రోజు కూడా నేనే అట్టి దివ్య లీలలను మీకు ప్రసాదిస్తున్నాను అని చెప్పినది లేదు.

బాబా తత్వాన్ని తమ ఆచరణ ద్వారా ప్రచారం చేసిన శ్రీ భరద్వాజ మాస్టర్ గారు తాము ఎంత గొప్ప స్థితిలో ఉన్నప్పటికీ తనకా స్థితి ప్రసాదించిన సాయిబాబాయే సర్వసమర్థులని, వారే అన్ని జీవులను ఉద్ధరించగలరని తాను నిమిత్తమాత్రుడునని ఎన్నోసార్లు బోధించారు.

అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని రాసుకోయ్యా! అన్న సూక్తిని తన జీవిత ఆచరణ ద్వారా అనుభవం పొందిన శ్రీ సుబ్బరామయ్య సార్ తన దగ్గరికి వచ్చిన ప్రతి జీవి కష్టాన్ని తన కష్టంగా భావించి సేవ చేశారు. కానీ ప్రతి పని వెంకయ్య స్వామి చేస్తున్నారు, అంతా ఆయన ఇష్ట ప్రకారమే

జరుగుతుంది (అయన ఇష్టం గదా!) అని పదే పదే బోధించేవారు, గుర్తింప చేసేవారు. నరనరాల్లో "స్వామి వారే యజమాని అని" జీర్ణించుకుపోయిన సాధారణత్వం అది.

బాబా "అల్లా మాలిక్" అన్నా, వెంకయ్య స్వామి "పై వాళ్ళు చూస్తుళ్లయ్యా" అనినా, మాస్టారు "అంతా సాయి కృప" అన్నా, సుబ్బరామయ్య సార్ "అయన ఇష్టం గదా !" అని భోదించినా, వారందరూ మనల్ని గుర్తించమనేది సృష్టి అంతటికీ ఆధారమైన ఆ పరమాత్మ తత్వాన్నే.

శ్రీ సాయిబాబా మహామంత్రంలా చెప్పే ఈ "అల్లామాలిక్" కు శ్రీ మాస్టారి వివరణ, శ్రీ సుబ్బరామయ్య సార్ ఆచరణతో హృదయగతం చేసుకొనే ప్రయత్నం, హృదయగతం కాకుంటే వచ్చే నష్టం, అలా హృదయగతం కావడానికి చేయవలసిన ప్రయత్నం ఏమిటో, ఈ గుర్తు స్థిరమైన వారి జీవనం ఎలా ఉంటుందో ఈ సంచికలో స్మరించుకుందాము.

**"అల్లామాలిక్" కు శ్రీ మాస్టారి వివరణ:**

శ్రీ భరద్వాజ మాస్టర్ శ్రీ సాయి ప్రభోదామృతంలో "అన్నీ భగవంతునిచే ఏర్పడినవే, ఆయన ఆధీనంలోనివే అని, మన మనోదేహదుల వరకూ అన్ని నియమించి నడపే శక్తి భగవత్ శక్తే అని, ఈ భావననే "అల్లామాలిక్" "

అని చెబుతారు. “ఈ భావన లేకపోవడమే, నేను (నావల్ల), నాది (నాకు కావలి) అనే భావమే అజ్ఞానము” అని చెబుతారు.

ఈ విషయాన్నే ధ్యానయోగ సర్వస్వంలో మరింత వివరంగా “అంతా భగవంతుడే, అంతా ఆయన సంకల్పం వల్లనే జరుగుతోంది. మన రూపంతో సహా అన్ని అయిన రూపాలూ ఆయనవే. దీనికి వ్యతిరేకమైన భావం అజ్ఞానము” అని చెబుతారు.

శ్రీ సాయి ప్రబోధామృతంలోనూ, ధ్యానయోగసర్వస్వంలో కూడా “ఈ “అల్లామాలిక్” భావన లేకుండటం, మరపు - “అజ్ఞానము”, మాయ వల్ల కలిగినా అది పాపంగా పరిగణించబడుతుంది” అని చెబుతారు.

**“అల్లామాలిక్” హృదయగతం కాకుంటే వచ్చే నష్టం : దుఃఖము**

“అల్లామాలిక్” అనే గుర్తు అనుక్షణము మనకు లేకుంటే, నేను నాది అనే సహజంగా ఉండే భావాలే బలపడి, నేను చేశాను, నావల్లనే అనే అహంకారము, నాది- నాకు కావాలి అనే భావము, కోరికగా మమకారము బలపడి మనము చేసే ప్రయత్నాలు అన్నీ దుఃఖ నివృత్తికి బదులు, మరింత దుఃఖాన్నే తెచ్చిపెడాయి అని మాస్టారు ప్రభోధామృతంలో చెబుతారు. దీనినే శ్రీ స్వామి వారు “ఆశ” అన్నారని, ఆ ఆశకే “ఇష్టా -ఇష్టాలు” మరో పేరని శ్రీ

సుబ్బరామయ్యసార్ మాష్టారి భోధామృతంలో తెలుపుతారు. "అల్లామాలిక్" ఎరుక లేకపోవటమే అజ్ఞానము అయితే అది ప్రకృతి సిద్ధమేగా ? అంటే "అల్లామాలిక్" ఎరుక లేకపోవటం వల్లనే అనేక తుచ్ఛ కామ-క్రోధాలు (అరిషడ్వర్గాలు), రాగద్వేషాది భావాలకు తద్వారా కలిగే దుఃఖానికి కారణం అని మాస్టారు "ధ్యానయోగసర్వస్వం" లో చెబుతారు. ఈ భావంలో ఉండడాన్ని పాపం అని కూడా అంటారు.

## "అల్లామాలిక్" హృదయగతం కావడానికి చేయవలసిన ప్రయత్నం : సదురుసేవ - శరణాగతి

అయితే ఈ "అల్లామాలిక్" అనే భావం నిలుపుకుందాం అంటే ఆ భావన నిలువకుండా చేసేది ఏమిటి ? మన లోని ఇష్టాయిష్టాలు, ఇంద్రియ చాపల్యాలు, వాటికి కారణమైన ఆశ (కావలి అనే కోరిక). ఇవన్నీ కూడా నేను, నాది అనే దృఢమైన, బలమైన ఆలంబన ఆధారంగా చేసుకుని ఉన్నాయి అని శ్రీ మాస్టారి భోదామృతం, మాష్టారి ప్రవచనాల వివరణలలో తెలుపుతారు. అంతేకాక నేను నాది అనే ఈ భ్రమలను గుర్తించి, ఎరుక గలిగి మరల "అల్లామాలిక్" అని సత్యాన్ని గ్రహించుటకు అవసరమైన

అవగాహనను ఎన్నో ఉదాహరణలతో శ్రీ మాష్టారి ప్రవచనాల లోని "అల్లామాలిక్" అనే అధ్యాయంలో వివరిస్తారు.

"అల్లామాలిక్" అనే గుర్తును నిలిపి, నేను-నాది అనే భావన అధిగమించే సాధనకు సహకరించే శ్రీ మాష్టారి, శ్రీ సార్ మాటలు: "**ప్రతి విషయానికి గురువుపై ఆధారపడటమే నిజమైన సాధన**", "**మరుపే మరణం**", "**స్మరణకు స్మరణే దోహదము చేస్తుంది**", "**నిర్ణీత కాల స్మరణ నుంచి నిరంతర స్మరణకు వెళ్లాలి**".

అవగాహనతో కూడిన భక్తి-విశ్వాసాలు, ధర్మాచరణ, సంస్కారాల మార్పుకై పశ్చాత్తాపాలు, ప్రాయశ్చిత్తాలతో కూడిన ప్రార్ధన; సత్సంగము-నిష్కామకర్మ, అన్ని జీవులలోని భగవంతుని సేవ, సద్గురుసేవ-శరణాగతి లతో పైన సూచించిన మాష్టారి వాక్యాలను సహజసిద్ధం చేసుకోవాలని శ్రీ మాష్టారి, సార్ ఆచరణ, భోధ తెలుపుతుంది.

శ్రీ సార్ మాస్టారి బోధామృతంలో సద్గురువు విశ్వప్రేరణ అధికారి, సర్వ ప్రేరణ అధికారి అన్న గుర్తు ఉంటే, ఎవరిని తప్పు పట్టలేము. అంటే "అల్లామాలిక్" అని గుర్తిస్తాము అని తెలుపుతారు.


## "అల్లా మాలిక్" అన్న ఎరుక స్థిరమైన వారి జీవనం ఎలాఉంటుంది ?

శ్రీ మాస్టారు ధ్యానయోగసర్వస్వం లో "అంతా భగవంతుడే, అంతా ఆయన సంకల్పమే అన్న ఈ "అల్లామాలిక్" గుర్తు నిలిచిన వారికి భగవంతుడు సంతోషం రూపంలోనూ, గుర్తు లేని వారికి కష్టాలు- దుఃఖము రూపంలో ఎల్లప్పుడూ తోడు ఉంటారు" అని చెబుతారు. "అల్లామాలిక్" అన్న ఎరుక వలన శరణాగతితో సద్గురు సేవలో నిలిస్తే వారి జీవనం తృప్తి-శాంతి, ఆనందాలతో సాగుతుంది అనడానికి ఈ మహాత్ముల అందరి జీవనము గుర్తు.

శ్రీ సార్ ఆచరణ ద్వారా చూపిన "అల్లామాలిక్" : ధనేషణ, దారేషణ, పుత్రేషణలను "అల్లామాలిక్" అను ఎరుకతో ఎలా అధిగమించారో ఈ క్రింది సన్నివేశాలతో గుర్తిద్దాము.


1. చిన్నప్పటి నుండి ఇతరుల బాధలకు స్పందించడం,
2. ఎంతటి క్లిష్ట పరిస్థితి లోనైనా, తనవారైనా కాకున్నా నిర్భయంగా మానవత్వంతో సహాయం చేయటం.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దుర్గాస్వామి

3. శ్రీ మాస్టరు పరిచయమయ్యాక తన ఇష్టా ఇష్టాలకు తావివ్వక శ్రీ మాష్టారి సూచనల ఆచరణ, శ్రమతో సేవ ఆచరణ : క్యూరింగ్ కు నీళ్లు పోయడం, అందరికీ (వారు కూడా సాయిబాబా రూపాలని) అన్నం వండి పెట్టడం వంటి గురుసేవతో సద్వినియోగం చేసుకోవటం, నిర్ణీత కాల స్మరణ నుండి నిరంతర స్మరణ సాధించటం (శ్రీ మాష్టారు సూచించినట్లు కాలము ఉదయం 6 - 9 గం . ఇవ్వటంతో ఆరంభించి నిరంతర స్వామి స్మరణ లో జీవించడం).

4. అవగాహనతో కూడిన భక్తి-విశ్వాసాలు, సంపూర్ణ శరణాగతితో జీవించటం: మాష్టారి కృపతో మానవ ప్రయత్నమా? - దైవ నిర్ణయమా? అన్న కీలక ప్రశ్నకు సమాధానం కన్ఫర్మేషన్ కావటం. “అల్లామాలిక్” అన్న ఎరుకలో స్థిరం కావటం.

5. Live at the Present ఆచరణ: (మన) ఆలోచనలు (అన్ని) - అహంకారమే ! అన్నీ చేసేది ఆయనే, ఆయన సంకల్పమే జరిగేది, కార్య రూపం దాల్చేది. అయితే నా ఆలోచనలకు శక్తి ఏముంది? ఇంక ఎందుకు? అన్న అవగాహన - ఆచరణ. “అల్లామలిక్” ఎరుకతో వచ్చే మార్పు.

6. ధ్యానం అభ్యసించడమే కాక, ధ్యానం కోసం నేను నాది మొదలగునవి వదులుట: బర్రెలు పెంపకం, వడ్డీ వ్యాపారం లెక్కలు మొదలగునవి ధ్యానమునకు ఆటంకము అని గుర్తించాక నిష్కర్షగా (ధనేషణ) వదులుకోవడం. ఇతరులతో సంభాషణలు ధ్యాన సమయంలో గుర్తురావడం వలన ధ్యానం జరగకుంటే పరువు-మర్యాదల గురించి ఆలోచించాక (అందరూ మూత్రవిసర్జన చేసే చోటైనా) ఏకాంతంగా సమయం గడపడం.

7. గొలగమూడి నివాసము శ్రీ స్వామివారి ఆదేశముగా భావించి, గుర్తించి అమ్మగారు పిల్లలు రావడం గూర్చి ఆలోచించకుండానే రోజూ రాత్రి నిద్ర చేయడం ఆచరణ (దారేషణ వదలటం). అచ్చట ఇల్లు కూడా చాల తక్కువ ధరకు అమ్మి వేయటం (ధనేషణ వదలటం).

8. గొలగమూడి నివాసము, నియమపాలనలలో బంధువుల, ఇతరుల అభిప్రాయాలకు చూడక గురు ఆదేశముపై దృష్టి నిలపి పాటించటం. చెయ్యి విరిగి పోయినప్పుడు కూతురు-అల్లుడులకు కూడా తెలపక ధైర్యంతో గొలగమూడి దాటని నియమ పాలన చేయటం (లోక వాసన వదలడం).

చెయ్యి తిరిగి కట్టుకోవాలి అని కూడా ప్రార్థించక స్వామికే శరణాగతి చేయటం. కాలు విరిగినప్పుడు ఇట్టి సంపూర్ణ శరణాగతికి మెచ్చి స్వామి పుత్తూరు డాక్టర్ ను గొలగమూడి రప్పించి కట్టు కట్టేటట్టు చేయటం - అల్లామలిక్ ఆచరణ ఎలా ఉంటుందో శ్రీ సార్ ఆచరణ చూపితే - అల్లామాలిక్ అని స్వామి అనుభవంతో మనందరికీ చూపటం.

9. సార్ గొలగమూడి వచ్చాక స్వామి చూపించిన ఆశ్రమ స్థలంలో చిన్న షెడ్ లో కాపురం. అప్పట్లో గొలగమూడిలో  భక్తులకు వసతి కూడా లేనందున అందరి సౌకర్యార్థం శ్రీ సార్ ఇల్లు (ఎట్టి స్వార్థం లేకుండా-గురు సేవ గా) ఇవ్వడం.  ఆ ఇల్లు ఏ క్షణాన్నైనా ఖాళీ చేసేస్తానని ఆశ్రమం వారికి రాసి ఇవ్వడం అల్లామాలిక్ గా జీవించటం కాక మరేమిటి ?

10. శేషయ్య కు డబ్బు లెక్క మొదలుగునవి తెలియకున్నా, చదువు రాకున్నా, ఎట్టి బాధ, చింతా లేక, మారు ప్రయత్నాలు చేయక శేషయ్య ఆరోగ్యం కై స్వామికి శరణాగతి చేయటం, వారి మాటకు సంపూర్ణంగా విలువనివ్వడం. శేషయ్య తప్పి పోయినప్పుడు స్వామిపై విశ్వాసంతో నిశ్చింతగా ఉండటం (పుత్రేషణ వదలటం).

11. శ్రీ సార్ గొలగమూడి లో ఉండటం ఇష్టం లేని కొందరు సార్ ను గొలగమూడిలో ఉంటే చంపేస్తాము అని బెదిరిస్తారు. శ్రీ సార్ స్వామి వద్దకు రాగానే “సమయము వచ్చినప్పుడు ఎక్కడైనా మృత్యువు కొడుతుంది” అన్న శ్రీ మాస్టారి మాట గుర్తు వచ్చి హాయిగా వెళ్లి నిద్ర పోయారు. అంటే తన జీవితము - మరణము గూర్చిన పూర్తి ఇచ్ఛ (నేను-నాది లను) శ్రీ స్వామి వారికి శరణాగతి చేసారు. ఇట్టి శ్రీ సార్ జీవనం “అల్లామాలిక్” అను శాస్త్ర, భగవత్ వాక్యానికి ప్రత్యక్ష ఆచరణాత్మక వివరణ.

మనందరికి కూడా అట్టి ఎరుకని ప్రసాదించి, ఆ ఎరుకతో (నిరంతరం) జీవించగల భాగ్యాన్ని ప్రసాదించమని శ్రీ సార్ ను ప్రార్థిస్తూ - సాయి

## సాయి శివ డైరీ నుండి సార్ సన్నిధి

09-08-2004: రాత్రి 8 గంటలకు సార్ చెప్పినవి:

1. ప్రతి చిన్న విషయానికి గురువుపై ఆధార పడటమే అసలైన సాధన.

2. దీనినే మాస్టారు ఇష్టము, అయిష్టము లేకుండా ఉండడమే సాధన అన్నారు.

ఈ రెండు నువ్వు ఎప్పుడూ బాగా మననం చేస్తూ ఉండు అని అన్నయ్య (సాయి) తో అన్నారు.

సార్ రెండు వారాల క్రితం "మనం చేసే ప్రతి పనీ ఆయన సేవే అనే భావం దృఢంగా ఉంచుకోవాలి" అని చెప్పారు. "దేవా! నీవే ఈ సృష్టి యజ్ఞం చేస్తున్నావు. నీ చైతన్యమే ఈ చాప రూపం ధరించింది. దానికి నువ్వే అందరి రూపాలలో కృషి చేసావు. అలాగే **నాకు ఈ పని ఇచ్చావు. నేను అది నీకు తృప్తి కరంగా చేయాలి** - అనే భావం దృఢంగా ఉంచుకోవాలి" అన్నారు.

22-08-2004:

సద్గురు శ్రీ దర్గా స్వామి వారు గొలగమూడి లో శ్రీ భరద్వాజ ఆశ్రమం వచ్చి ఉన్నారు. సార్ ఉదయం 9:30 గంటలకు స్వామి దర్శనార్థమై మమ్మల్ని తీసుకుని వెళ్లారు. అప్పుడు దారిలో ఇలా అన్నారు: **"భగవంతుడు మనకి ఇచ్చిన పనిని చేయడం పైననే మన ధ్యాస ఉండాలి. స్వామి నాకు పూజ చేసే డ్యూటీ ఇచ్చాడు. ఇచ్చిన opportunity ని వినియోగించుకొని నేను బాగా చేయాలి. అంతేకానీ దర్గా స్వామి వచ్చారని నేను పూజకు పోకుండా ఉంటే, మరురోజు నుండి వెంకయ్య స్వామి నన్ను రానివ్వడు. అందుకే నేను ఉదయాన్నే పోలేదు"** అన్నారు.

సార్ ఉదయం పూజ నుండి వచ్చిన తర్వాత కూడా దర్గా స్వామి వద్దకు వెంటనే పోకుండా నిద్ర పోయారు. రాత్రి నిద్ర సరిగా లేదు. ఇప్పుడు పడుకోకుండా ఉంటే మరల మధ్యాహ్నం (11 గం|| లకు) శ్రీ స్వామి వారి పూజ సరిగా చేయలేను. మనకు గురువు అనుగ్రహించిన సేవను ఆయనకు తృప్తి కలిగించేలా చేయాలి.

## భక్తుల అనుభవాలు

ఓం శ్రీ సాయిరాం

అల్లా-భగవంతుని స్వరూపమైన సద్గురువు సన్నిధి, సాంగత్యం, శరణ్యం లభించినప్పుడు మన జీవితాలలో కొన్ని ముఖ్య సంఘటనలు మన ప్రమేయం గానీ మన కర్మ ప్రమేయం వల్ల గాక ఆ భగవంతుడే (మాలిక్ గా) దగ్గర ఉండి నడిపిస్తాడు. ఆ సందర్భాలలో “నేను, నాది” అనే అహంకార మమకారాలు భగవంతుడు చాలా చిత్రంగా తీసేస్తాడు (తలెత్తకుండా చేస్తారు). కొంతకాలం అయిన తరువాత తిరిగి చూసుకుంటే ఆ సందర్భంలో మన స్వతహాగా కానీ, మన ఖర్మ ప్రకారంగా జరిగింది అని అనిపించదు. మన అతితెలివి ఆలోచనలు చేయనందుకు, సద్గురు కృపకు

మనమే ఆశ్చర్య పోతాము. అటువంటి వాటిని కొన్నింటిని ఇక్కడ ప్రస్తావించుకొందాము.


❖ ప్రసాదు తను చేస్తున్న బెంగళూరులోని ఉద్యోగం మానేసి నెల్లూరు దగ్గర ఇంజనీరింగ్ కాలేజీలో జాయిన్ అవుదామనుకున్నాడు. ఆవిషయమై తన గైడ్ అయిన రవికుమార్ సార్ ప్రసాద్ ని ఉద్యోగం మానద్దని చెప్పినా ప్రసాద్ కి అర్ధం కాలేదు. ఈ విషయం సుబ్బరామయ్య సార్ కిచెప్పలేదు. ఒకరోజు ఉదయం సుబ్బరామయ్య సార్ సత్సంగంలో భరద్వాజ మాస్టారు గురించి చెపుతూ ఏ ప్రస్తావన లేకుండా ప్రసాద్ తో “నీవు ఉద్యోగానికి రాజీనామా చేయొద్దు” అని చెప్పారు. ఆ మాటలో ఏ ప్రభావం ఉందోగానీ ప్రసాద్ కి ఉద్యోగం మానేయాలనే ఆలోచన పూర్తిగా పోయింది. అంతకుముందు రవికుమార్ సార్ ఎంతచెప్పినా అర్ధం కానీ ప్రసాద్ కు మరెన్నడూ ఉద్యోగం మానేయాలనే ఆలోచన రాలేదు. సార్ చెప్పినట్లుచేయటం వలన ఈనాడు ప్రసాద్ కు ఏ ఆర్థిక ఇబ్బందులు లేవు.

❖ ప్రసాదు తను చేస్తున్న ఉద్యోగం కాక వ్యాపారం చేద్దామనుకున్నాడు . ఈ విషయం సుబ్బరామయ్య సార్ కి ఏనాడూ చెప్పలేదు. ఒకరోజు సార్ దగ్గరికి వచ్చిన ఒక భక్తుడు పెట్టిన వ్యాపారంలో చాలామంది కస్టమర్లు డబ్బులు ఇవ్వాల్సిన వారు ఇవ్వకుండా ఎగనామం పెట్టారు. ఆ నష్టాల

గురించి అతను సార్ కి చెపుతున్నప్పుడు ప్రసాద్ శ్రీ సుబ్బరామయ్య సార్ దగ్గరకి వెళ్ళాడు. సార్ ప్రసాద్ కి చెబుతూ "నువ్వెప్పుడూ బిజినెస్ చేయకు. మనకు ఎంత కావాలి? నెలకి వెయ్యి రూపాయలు ఉంటే సరిపోతుంది" అని చెప్పారు ప్రసాద్ కి. అంతటితో ప్రసాద్ కి వ్యాపారం చెయ్యాలనే ఆలోచన శాశ్వతంగా తుడుచుకు పోయింది.


❖ ఒక భక్తురాలు తనని ఒక పెళ్లి సంబంధం వారు చూసి ఇష్టపడిన విషయం సార్ కి చెప్పింది. సార్ ఆ సంబంధం మంచిది అని ఖాయం చేసారు. ఒక వారం తరువాత ఆ భక్తురాలు సార్ తో తనకి ఆ సంబంధం వద్దని, తనకు ఇలాంటి ఉద్యోగాలు చేసేవారు అంటే ఇష్టమని చెప్పింది. సార్ ఆమెతో "అమ్మా! వెంకయ్యస్వామి చూపెట్టిన సంబంధం చేసుకుంటే, ఉత్తరోత్తర సంసారంలో ఏమన్నా ఇబ్బంది వస్తే ఆయనే చూసుకుంటారు. అలాగాక మన ఇష్ట ప్రకారం చేసుకుంటే స్వామి పట్టించుకోడు" అని చెప్పారు. రెండు వారాల తరువాత ఆ భక్తురాలు సార్ దగ్గరకి వచ్చి మరలా ఆమెకు ఆ సంబంధం ఇష్టం లేదు అని చెపితే సార్ "నీ ఇష్టాయిష్టాలు తీసెయ్యమ్మా!" అని చెప్పారు. రెండు వారాల తర్వాత అదే విషయం సార్ కి చెపితే "నీ ఇష్టాయిష్టాలు సబ్బుతో కడిగేయమ్మా!" అని చెప్పారు. ఆ భక్తురాలు సార్ చెప్పినట్లే తన


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాష్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దగ్గాస్వామి

ఇష్టాఇష్టాలని ప్రక్కకు పెట్టి పెళ్లి చేసుకుంది. పెళ్లి అయిన ఒక నెలకల్లా ఆ భక్తురాలికి తన భర్త ఎంతో నచ్చాడు. అంతకు ముందు ఉన్న అయిష్టపు ఆలోచన ఆమెకు ఎన్నడూ రాలేదు. పెళ్లి అయిన మూడు సంవత్సరాల తరువాత ఆ భక్తురాలి సంసారంలో ఇబ్బందులు వచ్చాయి. ఆ ఇబ్బందులు వచ్చినప్పుడు ఆ భక్తురాలు విడాకులు ఇచ్చేద్దామనుకున్నది. కానీ సార్ ఆమెను అరచి "నీకు డిగ్రీ సర్టిఫికెట్ ఉందని అహంకరిస్తున్నావు, విడాకులు ఇస్తే సర్వనాశనం అవుతావు" అని చెప్పారు. ఆ ఇబ్బందులన్నింటినీ సార్ తమ దివ్య శక్తితో తొలగించారు. ఇప్పుడు ఆ భక్తురాలి కాపురం హాయిగా, ఆనందంగా సాగుతోంది.

❖ సాయి సుబ్రహ్మణ్యం బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నప్పుడు అనారోగ్యమైంది. గొలగమూడి సుబ్బరామయ్య సార్ సంరక్షణలో అతను స్వస్థుడైనాడు. అనారోగ్యమైనప్పుడు ఉద్యోగం మానెయ్యమని చెప్పినప్పుడు అతను, అతని ఇంటిలోని వారంతా సార్ చెప్పారని ఆ ఉద్యోగం మానేశారు. సార్ సంరక్షణలో ఆరోగ్యవంతుడైనపుడు తరువాత ఏమి చెయ్యాలనే విషయమై సందేశం కోసం మన స్వంత నిర్ణయం తీసుకోరాదని శ్రీ సార్ సూచించి వెంకయ్యస్వామి మీద ఆధారపడేటట్లు చేసారు. శ్రీ సార్ సూచించినట్లు చీట్లు వేస్తే IIT మద్రాస్

లో PhD చేయమని శ్రీవెంకయ్యస్వామి చెప్పారు. IIT కి సాయి వెళ్లాడనే గానీ అతనికి ఎప్పుడూ సార్ తో ఉండాలని గొలగమూడి వచ్చేవాడు. సార్ అతనితో నెలకు ఒకసారి మాత్రమే గొలగమూడికి రమ్మని, వెంకయ్యస్వామి చెప్పినట్లు Ph D చేయమని సాయిని సముదాయించి పంపేవారు. సాయి IIT లో ఉన్నా మనసంతా సార్ మీద ఉండడంతో ఎలిజిబిలిటీ టెస్ట్ లో రెండు సబ్జెక్టులలో తప్పాడు. బాగా చదివే సాయి ఇలా తప్పడంతో అతని గైడ్ చాలా ఆశ్చర్యపోయాడు. అలాంటి సమయంలో జరిగిన ఇంటర్వ్యూలో హెడ్ అఫ్ ది డిపార్టుమెంటు వచ్చి సాయిని చూసి ఇంకేమీ చూడకుండా, ప్రశ్నించకుండా "అడ్మిట్ హిమ్" అని చెప్పి వెళ్లిపోయాడు. ఇదంతా చూస్తే శ్రీ వెంకయ్య స్వామే ఆ హెడ్ అఫ్ ది డిపార్టుమెంటుకి ప్రేరణ పెట్టి సాయి యొక్క PhD అవటానికి అవకాశం కలిగించారు.

❖ నగేష్ గుర్గావ్ లో ఉద్యోగం మానేసి హైదరాబాద్ లో ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్న రోజులవి. ఒకరోజు తన ఇంట్లోని వారు అతనితో నీకు పెళ్లి అయితే అన్నీ బాగుంటాయని చెప్పి జ్యోతిష్కుడు చెప్పాడని, ఒక పెళ్లి చూపులకి తీసుకు వెళ్తున్నప్పుడు సార్ ఫోన్ చేశారు. విషయం తెలుసుకుని ఇప్పుడు పెళ్లి చేసుకుని ఏమి చేస్తావు అని మందలించారు.

దానితో నగేష్ ఆ పెళ్లి సంబంధం చూడటానికి వెళ్ళలేదు. ఆ నిర్ణయం నగేష్ జీవితంలో ఒక మలుపు. దాని తర్వాత శ్రీ సుబ్బరామయ్య సార్ ని సేవించుకునే అవకాశం కలిగింది. సార్ కి సేవ చేయటమే అతని పెళ్లి ఏమో? ఆ సద్గురువుని సేవించి తరించే మార్గంలో నడవటమే అతనికి పెళ్లి తరువాత బాగుండటమా?

# శ్రీ సుబ్బరామయ్య సార్ లేఖలు

## 2000 సం|| లో లక్ష్మి గారికి : ఇహ పరాలకూ సద్గురు సేవ

గొలగమూడి

పూజ్యులైన లక్ష్మిగారికి శ్రీ సాయిశుని దయవలన నూతన సంవత్సరములో మీకు సర్వశుభములు కలుగవలెనని ప్రార్ధన. శ్రీ సాయి అని వ్రాశాను. శ్రీ మాష్టారు, శ్రీ వెంకయ్య స్వామి అని అనేకులు బాహ్య దృష్టికేగాని, అంతర్ దృష్టితో వారంతా ఒక్కటే కదా!

అసలు మీకు అలాంటి నిస్పృహ కలగడానికి కారణమేమో బాగా మీరే యోచించండి, మీకే తెలుస్తుంది. నా స్వల్పమైన బుద్ధికి తెలుస్తుంది ఏమంటే, మీరీ జన్మలోనే ఏదో సాధించాలని తలచారు. గట్టిగా. అది

సఫలీకృతం అయ్యేటట్లు లేదని మీ నిరాశ, నిస్పృహ. నాలాంటి రోగిష్టి వారికైనా ఉండవచ్చునేమో కానీ, మీకు నిస్పృహ రాకూడదు. వరుసగా 1వ నెల నుండి ఆయాసం, చలి విపరీతంగా ఉంది. ఇదే సమయంలో మిగిలిన ఇద్దరు పూజారులకు అనారోగ్యమై మంచం పట్టారు. నేను ఎందరు చెప్పినా వినకుండా రాత్రి 2 గంటలకు లేచి పోతున్నాను. ఆ కాలంలో మాత్రలు మింగే పోతున్నాను. కానీ 2 తేది రాత్రి బాత్రూములో నుండి ఇంట్లోకి రాలేకపోయాను. అంత తీవ్రమైన ఆయాసం. 2 గంటల 35 నిమిషాల వరకూ ఏమీ తగ్గలేదు. 1/2 మాత్ర బదులు 3 మాత్రలు మింగాను. ఇక లాభం లేదని మరొకరిని పంపాను పూజకి. ఇంతటి బాధలో కూడా సంతోషంగా ఉంది. ఎందుకు? నా ప్రారబ్ధాన్ని త్వరగా కడిగేస్తున్నారు, శ్రీ స్వామి అని. నెమ్మదిగా (స్లోగా) తీర్చేకంటే ఇది మంచిది కదా! నాకు అంతటి బాధలో కూడా నిరాశ, నిస్పృహ ఎందుకోగానీ కలుగలేదు. నేనొక మొద్దునో ఏమో తెలియదు.

నాకు తెలిసింది ఒక్కటే. జీవిత కళ తెలుసుకుని సంతోషంగా స్వామిని స్మరిస్తూ జీవించి, ఆయన ఈ డ్రామా సీను నుండి వైదొలగమ్మన్నదాకా నవ్వుతూ, నవ్విస్తూ ఉండడమే. సాధన ఎలా చేయాలో ఏమిటో - సాధనంటే ఏమిటో తెలియని వాణ్ణి. ఆయనే తన పాదాల దగ్గరకు

తోసారు. ఇక ఆయన ఇష్టం. నన్ను జీవిత పరంపరలలో పడతోస్తాడూ, తోయనీ - నా మనసు వారి యందు లగ్నమై ఉంటే ఏ శరీరమైనా బాధలేదు. జన్మరాహిత్యం చేయాలో (వద్దో) ఆయన నిర్ణయం – ఆది నాకు సంబంధించినది కాదు. ఇచ్చిన జన్మలో హాయిగా, సంతోషంగా జీవిస్తూ ఇతరులను సంతోషపెడుతుండడమే నా ధ్యేయం. అంతకంటే నాకేమీ తెలియదు. తెలుసుకోవాలనే బుద్ధి లేదు.

02-01-2000 రాత్రి, అంతటి బాధలో నాకొక తీవ్రమైన నిర్ణయం స్థిరంగా హృదయగతమైంది. ఇంతటి బాధలో, ఈ ప్రపంచంలో ఎవరు మనలను ఆదుకోగలరు? ఒక్క శ్రీ స్వామి వారు మాత్రమే. గతంలో ఇంతకు ముందు 1 నెల రోజులుగా అన్నం, నిద్రలేని నాకు ఒక్క నిమిషంలో వారి సన్నిధి చేరగానే ఘాడంగా నిద్ర పట్టింది, 8 గంటల సేపు. తెల్లవారి అన్నీ సుష్టుగా తిన్నాను. అలా 15 రోజులు జరిగింది. ఆ తర్వాత 83 వ సంవత్సరంలో ఇదే తంతు జరిగింది. అనారోగ్యంతో మద్రాసు పోవాలని, ముందు శ్రీ స్వామివారి సమాధికి నమస్కరించాలని బస్సు ఎక్కగానే నా బాధలు మటుమాయమయ్యాయి. మరి అలా ఆదుకున్న స్వామి ఇపుడు ఈ బాధలకు గురిచేశారు. మన మంచికే ప్రారబ్దం కడిగేస్తున్నారన్న బాధలో నవ్వుతున్నాను. మావాళ్ళు నవ్వుతావేమిటి? అంటుంది. ఆమె బాధ నాకు

పిచ్చి కూడా వచ్చిందేమోనని ఆమె భయం. అలాంటిదేమీ లేదు. అందువలన పుస్తక పఠనం కూడా నిలిపేశాను. నిరంతరం హాయిగా నామస్మరణ ఒక్కటే చేస్తున్నాను. పుస్తకాలు చదివి నాకు చాలా తెలుసుననే సాత్వికాహంకారం నాలో పెరుగుతుంది. అందుకే శ్రీ స్వామి వారు నా మనసును అలా మళ్ళించారని భావించాను. పుస్తకాలు చదివి ఏమి తెలుసుకోవాలి?

"ధ్యానం, స్వధర్మో, నియమోయమశ్చ శతంచ శాస్త్రాణి సద్ వ్రతాని సర్వే మనో నిగ్రహ లక్షణాం తాహ:" అన్నారు.

కనుక ఇంకేమీ వద్దు. నిరంతర స్మరణే చేయాలని గట్టి నిశ్చయం కల్పించారు. ఇంతకూ చెప్పవచ్చేదేమిటంటే, అంతటి బాధలో కూడా నాకు నిస్పృహ కలగలేదు. ప్రారబ్ధం కడిగేస్తున్నారని ఆనందం మాత్రమే.

మీ లెటరులో ఇహ పరాలు చెడి అని వ్రాశారు. పరం సంగతి మనకు తెలియదు. ఇహంలో మీరేమీ పోగొట్టుకోలేదని నా భావన. రత్నాల్లాంటి ఇద్దరు బిడ్డలు, అనుకూలమైన భర్త, ఆత్మీయులైన స్నేహితులు. మీద్వారా అనేకుల జీవితాల్లో ఆనందం విరుస్తుంది. ఇలాంటి మీకు నిస్పృహ ఎందుకు కలిగిందో తెలియడంలేదు? మనం సాయి నుంచి గానీ, సాధన ద్వారా గాని ఏమి కోరాలి? నాకు తెలిసింది తృప్తి, శాంతి. అవి మీకు

సంపూర్ణంగా లభించాయని నేను తలచాను. కానీ మీరెందుకిలా వ్రాస్తున్నారో తెలియడం లేదు. ఎప్పుడూ రోగంతో పోరాడే నేను అసంతృప్తిగా, అశాంతిగా ఉండవచ్చుగానీ మీరెందుకిలా వ్రాస్తున్నారో ఆశ్చర్యంగా ఉంది? సాయిని ఆశ్రయించాక ఇక చింతకు తావే లేదు. ఆయన తనకివ్వబడిన ప్రతి పైసాను భగవంతునకు ఒప్పచెప్పి తీరాలని ప్రతిజ్ఞ చేశారు. మరి మనలను గమ్యం చేర్చరా? వారి చేతులలో పడడమే మన అదృష్టం. ఇక మనం వారి చేతులలో నుండి తప్పుకోనే తప్పుకోలేము. "నా జీవితం" అని వ్రాశారు. మనకు ఒక జీవితం అంటూ వేరే లేదు. అంతా ఆయనదే. అంతా ఆయనే అయితే ఇక మనము అనేది ఏముంది. మీ జీవితాన్ని ఆయన ఎప్పుడో కబళించారు. "ఇక సంపూర్ణ శరణాగతిలో మీరాయన సంకల్పానికి దాసులుకాక తప్పదు". అట్టి సంపూర్ణ శరణాగతికి ప్రథమ గుర్తు తృప్తి, శాంతి. అవి మీకు విస్తారంగా ఉన్నా, మీరేదో చేశారు ఎందుకు? నా పెన్ను కదిలించాలని మాత్రమే.

నిత్య సత్సంగాలు చేయనిదే మనం గమ్యం చేరలేము. పదిమందిలో తిరిగితేనే మనం చక్కని మార్గంలో ఉండగలమంటారు శ్రీ మాష్టారు. తప్పని సరిగా శ్రీ మాష్టారి ఆదేశము, కోరిక అని సంతోషంగా వారి కోరిక

తీరుస్తున్నామనే తృప్తిగా సత్సంగాలు మనమంతా చేస్తుంటే మనం వారికి శరణాగతి చెందినట్లు అవుతుంది.

స్వధర్మ పాలన ఎట్లాగా? మనం ఆఫీసులో ఉన్నా, ఇంట్లో ఉన్నా, వ్యాపారంలో ఉన్నా, చేతి వృత్తులలో ఉన్నా మనకిచ్చిన పని క్షుణ్ణంగా, సక్రమంగా నెరవేర్చడమే కదా! ఆశావ్యామోహాలను దరికి రానీయకుండా, మన ధర్మం ప్రకారం మనం నెరవేర్చడమే దైవారాధన. పండరీబాయి పిడకలేరలేదా? సక్కుబాయి (ఇంటి పనులు చేయ లేదా)-----?

త్వమేవ మాతాచ, పితాత్వమేవ అన్న శ్లోకంలో చెప్పబడ్డదాన్ని ఆచరించడమే. ఇంట్లో అందరి రూపాలలో ఆయనే ఉన్నారు. వాళ్ళందరి ఎడల మన ధర్మం మనమాచరించాలి. ఇంట్లో ముసలి వారుంటే మీ చావు మీరు చావండి, నేను దేవాలయానికి పోతానంటే ఎలాగండీ -సాయి అంగీకరిస్తారా! కుక్క, పిల్లిని నేనే నని చెప్పిన సాయి, ఈ ముసలి వారిలో కూడా ఉండరా? ప్రతి ఒక్కటి దాని స్థానంలో అది గొప్పదే అంటారు. Each is great in its own place. ఎప్పుడు అది, అలా (గొప్పది) అవుతుంది? దాని స్థానంలో అది తన పని సక్రమంగా నిర్వర్తించినప్పుడు, అది దాని స్థానంలో గొప్పదే.

ఒక నట్టు మనం బిగించిన చోట దాని త్రెడ్ పోయి ఊగులాడుతూ తన స్థానంలో ఉంటే సరిపోతుందా, ఆ నట్టు అక్కడ తాను చేయవలసిన పని చేయాలి కదా! అదే స్వధర్మ పాలన. మిగతా విషయాలు ఎవరికి వారు సాయినడిగితే చెపుతారు.

ఏ పని చేస్తున్నా మన మనసులో అన్యచింతలు ప్రవేశించకుండా మానసిక నామస్మరణ చేయడం మీద మనసు నిలపడమే సాధన. కూరగాయలకని పోతున్నాము. దోవంతా నామస్మరణ చేస్తున్నామా? మందిరానికి వస్తూ పోతూ ఉన్నాము, ఏమారకుండా నామస్మరణ జరుగుతుందా? ఇది అన్ని వేళలా చూసుకోవడమే సాధన. అలా (నామం) జరగకుండా ఆలోచనల వైపు ఎందుకు పోతుంది? రాగము, ద్వేషము, అసూయాది భావాలే కారణాలు. వాటిని వివేక విచారాలతో నిర్మూలించు కోవడమే సాధన. దీనినే మిలారేపాగారు సులువెరిగి సాధన చేయమంటారు.

ఈ ప్రపంచంలో సాయి తప్ప మిగిలినవేవీ (కీర్తి, ధనం) (ఎవరూ) మనలను కష్టాలలో ఆదుకోలేరు అనేది గట్టిగా హృదయగతం కావాలి. **ఎవరినుండైనా మనకు సహాయ మందితే దానికి మూలకారణం "సాయి అనే చైతన్య శక్తి" మాత్రమే.** మనం ఆ సహాయమందించిన మనిషిలోని సాయి చైతన్యానికి కృతజ్ఞులమై ఉండడమే. మనం ఆ మనిషినే కారణంగా గుర్తిస్తాము, కానీ సాయిని మరచిపోతాము. అలా మరచిపోకుండా

ఉండడమే సాధన. 01-01-1995 శ్రీ మాష్టారు పత్రికలో వ్రాసింది... అక్షరాల పై పేరాగ్రాఫులో నేను వ్రాసిన దాని భావమే. సాధకుని హృదయంలో మొదట జరుగవలసినది సంస్కరణ అన్నారు. సంస్కరణ అంటే మార్పుగదా! మనకు తారసపడ్డ వ్యక్తి కాకుండా ఆ వ్యక్తిని నడిపించే సాయి చైతన్యం మీద మనసు కేంద్రీకరించడం. ఇది ఉన్నపళంగా అబ్బదు. నిరంతరం నామస్మరణ చేస్తూ ఎవరి మనసును వారు అనుక్షణం చెక్ చేసుకుంటూ, కాస్త మనసు తన ఆలోచనా ప్రవంతి అనే వేగాన్ని తగ్గించుకుంటే తప్ప అందరిలో ఉన్న చైతన్యం వైపు దృష్టి నిలువదు. **అన్నం తినినంత సేపు స్మరణ చేయలేని మనసులకు అంతటా ఉన్న చైతన్యం మీద మనసు నిలపటం ఎలా సాధ్యం అవుతుంది?**

మనం చేయడమంటూ ఏమీ లేదు. మొదట కాస్త మనసు యొక్క తీవ్ర వేగాన్ని నిగ్రహిస్తే, ఆ తర్వాత అంతా సాయియే సమకూరుస్తారు. సంఖ్యా పరమయిన పారాయణలు కాకుండా పరాయణత చెంది చేసే పారాయణ, ప్రతి నిమిషం నామస్మరణ, పారాయణ చేశాక తర్కించుకొని ఈ లీల ఎందుకు చేశారు అని నోట్సు వ్రాసుకోవడం చేస్తుంటే సర్వం సమకూరుతుంది.

పెసల సుబ్బరామయ్య

--------- సద్గురు దేవా శరణం శరణం ---------

## 27-02-2000 న శ్రీమతి భవాని గారికి : సంపూర్ణ శరణాగతి చేస్తే భయం ఉండదు

గొలగమూడి

27-02-2000

పూజ్య గురుబంధు శ్రీమతి భవాని గారికి పెసల సుబ్బరామయ్య వ్రాయడం. సంపూర్ణ శరణాగతి చేసిన వారికి ఎలాంటి భయం ఉండకూడదు. అలా భయముంటే వారు సంపూర్ణ శరణాగతి చేయనట్లు లెక్క అని పెద్దలు చెబుతున్నారు.

కోటానుకోట్ల చీమలకు, పురుగులకు అన్నం పెట్టే ఈశ్వరుడు మనుషులకు పెట్టడా? కనుక పరమేశ్వరుని సంపూర్ణంగా విశ్వసిస్తే భయమే ఉండదు. నేనందుకే మా మామ గారి నుండి గాని, మా అమ్మమ్మ గారి నుండి గాని ఒక్క నయా పైసా ఆశించకుండా మరీ మా అమ్మమ్మనయితే సంవత్సరాల తరబడి చాకాను. ఎందుకు? మా అమ్మమ్మను మా ఇంట్లో ఉంచుకుంటే మా అమ్మకు సంతోషం. మా అమ్మ సంతోషించడమే నాకు కావలసింది. లక్షల ఆస్థిని సంపాదించినా మా అమ్మకు చిల్లి గవ్వ నివ్వనన్న మా అన్నయ్యతో కూడా నాకెలాంటి బేధభావం లేదు. మా అమ్మ చివరి వరకూ నా దగ్గరుండి, నాకు భగవంతుడిచ్చినదే తినింది. ఇప్పుడు మా అన్నయ్య, అమ్మ అందరూ ప్రపంచ నాటక రంగం నుండి వెళ్ళిపోయారు. వాళ్ళేమి

తీసుకు పోయారు – అసంతృప్తి మరియూ ఛండాలమైన సంస్కారములు వారితో పోయాయి.

అలాంటి అసంతృప్తి, సంస్కారాలు నాకు రానేరావని నా నమ్మకం. ఎందుకు? శ్రీ స్వామి వారికి వారిని నేను సంపూర్ణముగా శరణాగతి చేశానని నాకు నమ్మకము.

నీవుకూడా నీ బిడ్డలను భగవంతునకు అప్పగించు. వారికి, నీకు మేలు జరుగుతుంది. భగవంతునకు అప్పగించాక వారి పోషణ, పాలన ఆ బిడ్డల ఆయాలవలె చూడడమే మన విధి. వారి నిజమైన తల్లిదండ్రులు భగవంతుడు. నిజంగా మనందరి ఎడలా కూడా ఈ సత్యం వర్తిస్తుంది. కానీ మనం అజ్ఞానం వలన ఏవేవో ఆలోచనలలో మునిగి పోయి, గుండె బరువు చేసుకుంటాము. ఆ బరువు లేకుండా ఆయా వలె వర్తించడమే సాధనా ధ్యేయం. "దారం తెగిపోకుండా చూచుకుంటే ఎప్పుడూ మీ దగ్గరే ఉంటుండ్లాయ్యా" అన్నారు శ్రీ స్వామి వారు.

బిడ్డల బాధ్యత ఆయా వలె కాక మమకారం, వ్యామోహంతో గుండె బరువు చేసుకుంటే దారం తెగినట్లు లెక్క. అంటే బాధ్యత శ్రీ స్వామి వారికి కాకుండా మనం మోయడమన్న మాట. శ్రీ భరద్వాజ మాస్టారు అన్నారు. అమృత లేఖావళి అనే గ్రంథములో "నీకు భయము, ఆందోళన

ఉన్నాయంటే దానికి కారణం బాబాయందు అవిశ్వాసమే". బాబా మనకు కావలసింది చేసి తీరుతారు అన్న విశ్వాసముంటే భయముండదు కదా.

పెసల సుబ్బరామయ్య

--------- సద్గురు దేవా శరణం శరణం ---------

## 30-09-1999 న D.నాగేశ్వరరావు గారికి: శరణాగతి కుదరడం

గొలగమూడి

30-09-1999

పూజ్యశ్రీ D.నాగేశ్వరరావు గారికి పెసల సుబ్బరామయ్య నమస్కారములు.

శరణాగతి కుదరడం లేదని వ్రాశారు. అది కుదరడం లేదని మీకెలా తెలిసింది. శరణాగతి అందరికీ ఒకేలాగ ఉండదని నా భావన. మరి లక్ష్మక్క గారు ఏమంటారో తెలియదు. కొందరు వ్యక్తులు బ్రతకాలని ఆశ కూడా లేకుండా శరణు పొందుతారు. అది అందరికీ సాధ్యమా? కానీ ఆ విషయం తప్ప తక్కిన వాటిలో ఏ ఆలోచన రానీయకుండా ఉండగలుగుతారు. మరి వీరికి శరణాగతి లేదని చెప్పగలమా? ఇక్కడొకతను అలా సంపూర్ణ శరణాగతి చెంది జబ్బుకు మందుకూడా

తీసుకోకుండా మొండిగా ఉండేవాడు. ఈయన ఇలా చేస్తాడని శ్రీ స్వామి వారికి తెలుసు. కనుక ఇతనికింకా తీర్చవలసిన ఋణాలు, పొందవలసిన జమలు, ఈ శరీరానికి ఇంకా జరుగవలసిన మర్యాదలు ఊరకపోనిస్తారా. అలా జరగడమే God Principle గదా. సరిగ్గా ఈతడు మందు తినకుండా unconscious అయిపోయే సమయాన గుజరాత్ లో ఉన్న తన తమ్ముడు (ఇంజనీర్) వచ్చాడు. వెంటనే ఇతనిని ఆస్పత్రిలో unconscious స్థితిలో చేర్చాడు. స్పృహ వచ్చాక నేను వెళ్ళిపోతానంటాడు. డాక్టరు అలా వెళ్ళే వీలు లేదని గట్టి కాపలా పెట్టించి చికిత్స చేసి, మామూలు ఆరోగ్యం కలిగాక డిస్చార్జి చేశారు. అందరం ఆయనలాగా శరణాగతి చెందలేము. కానీ మనం శరణాగతి చెందలేదని చెప్పలేము. ఏ విషయములోనైనా మానసికబాధ లేకుండా మన ప్రయత్నాలు చేస్తూ, ఫలితం మనకు అనుకూలం కానీ ప్రతికూలం కానీ నిశ్చింతగా ఉంటే చాలు. అట్లా ప్రయత్నం చేయడం ద్వారా ప్రయత్నించవలసిన మన ఖర్మ నివారణమొందుతుందని సంతోషంగా ఉంటే చాలు. 'ఏ జీవికి ఏమి రావాలో అవి వచ్చి తీరుతాయి' అనే ఒక్క విషయం మరిచి పోకుండా ఉండడం ముఖ్యం. అన్నీ మన ప్రయత్నంతోనే జరుగుతున్నాయా? లేదు. "మనం ఏమారి ఉన్నా, దైవం మనలను కంటికి రెప్పవలె కాపాడుతున్నారు" అనే సత్యం ప్రతిక్షణం గుర్తుంటే మానసికబాధ,

టెన్షనుకు తావేలేదు. అలా టెన్షన్ లేకుండా, ఫలితం ఆశించకుండా, ప్రయత్నం చేయవలసిన మన కర్మ క్షాళన అవడానికి కృషి చేస్తున్నాము అనే (ఆలోచనతో) పని చేస్తుంటే అదే శరణాగతి. మానసిక బాధ లేకుండడమే శరణాగతికి గీటురాయి. ఒకే పని చేసిన ఇద్దరూ విఫలులై ఉండవచ్చు, లేక సఫలులై ఉండవచ్చు. ఒకరికి బాధ మరొకరికి శాంతి - భగవంతుడు నా మ్రొక్కుబడికి స్పందించలేదు అనుకుంటే బాధ. ప్రయత్నించ వలసిన మన కర్మ తీరిపోయింది అనుకుంటే శాంతి.

సత్యం, ధర్మం తప్పకుండా నడుస్తూ మనలను చీకటి నుండి వెలుగులోకి నడిపించమని, నిచ్చెన మీద నుండి పడకుండా కాపాడమని ప్రార్థిస్తుంటే శరణాగతి ఆయన కృపతోనే కలుగుతుంది.

నమస్తే

పె.సుబ్బరామయ్య

**---------- సద్గురు దేవా శరణం శరణం ----------**